

ఈనాడు
ఆదిలాబాద్
గురువారం అక్టోబరు 24, 2024

నాణ్యమైన పత్తికి మద్దతు ధర

ఈనాడు ఫోన్-ఇన్‌లో మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి గజానంద్



ఆదిలాబాద్ మార్కెట్లో ఈ నెల 25 నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభమవుతున్న నేపథ్యంలో 'ఈనాడు' ఆదిలాబాద్ జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి గజానంద్‌తో బుధవారం ఏర్పాటు చేసిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. నాణ్యమైన పత్తికి మద్దతు ధర లభిస్తుందని, జిల్లాలో 32 జిన్నింగ్‌మిల్లులను సీసీఐ లీజుకు తీసుకుందని, అక్కడ పత్తిని కొనుగోలు చేస్తుందన్నారు. జిల్లా వ్యాప్తంగా రైతులు పంటలను విక్రయించుకునేందుకు తమ సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు.

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం



? **ప్రశ్న :** ఆదిలాబాద్ మార్కెట్లో సంబంధిత సిబ్బందికి డ్రెస్‌కోడ్ ఉండాలి. సాత్నాల వైపు ఉన్న గ్రామాల రైతులు పంటను విక్రయించుకోవడానికి జైనథ్ వెళ్లాలంటే సరైన రోడ్డు లేదు.
- శివప్రసాద్‌రెడ్డి, మేడిగూడ, జైనథ్

✔ **జవాబు :** మార్కెట్ సిబ్బందికి డ్రెస్ కోడ్ పెడుతున్నాం. రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తాం.

? బజార్‌హత్నూర్ మండల రైతులు పంటను విక్రయించుకోవడానికి ఇచ్చోడ లేదా బోథ్‌కు వెళ్లాల్సి వస్తోంది. ఇక్కడే సబ్‌యార్డు ఏర్పాటు చేయాలి.
- శివుడు, బజార్‌హత్నూర్

✔ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం.

? ఇంద్రవెల్లిలో మార్కెట్‌యార్డు ఉన్నా.. ప్రైవేట్‌లోనే కొనుగోళ్లు జరుగుతున్నాయి.
- విష్ణు, ఇంద్రవెల్లి

✔ రోడ్డు పక్కన జరిగే క్రయవిక్రయాలపై చర్యలు తీసుకుంటాం.

? ప్రస్తుతం పత్తిలో తేమ శాతం 12కు మించి ఉంటుంది. తేమ నిబంధన పెంచే అవకాశం ఉందా?
- సుధీర్‌రెడ్డి, సుగుణాకర్, హరికృష్ణ(సాత్నాల, బోథ్ మండలం), సురేందర్‌రెడ్డి(అర్లి, తలమడుగు) సత్యనారాయణ, మల్లయ్య, (సిరికొండ), రాములు(తాంసి)

✔ సీసీఐ నిబంధన మేరకు 8 నుంచి 12 శాతంలోపు తేమ ఉండాలి. అంతకంటే ఎక్కువ ఉంటే సీసీఐ కొనుగోలు చేయదు. 25న ఆదిలాబాద్ మార్కెట్‌లో మాత్రమే పత్తి కొనుగోళ్లు ఉంటాయి. మిగిలిన కేంద్రాలను త్వరలో ప్రారంభిస్తాం. అప్పటి వరకు పత్తిలో తేమ కొంత తగ్గే అవకాశం ఉంది.

? తేమ, తూకం, తదితర వాటిలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మార్కెట్లో ఎవరూ పట్టించుకోవడం లేదు?
- అశోక్‌రెడ్డి(జైనథ్), విజయ్(మేడిగూడ), వినోద్(తాంసి), ఆశన్న(బెల్లూరి), జంగు(మల్కాపూర్)

✔ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అయిదు శాఖల అధికారులతో మల్టీ కంట్రోల్ రూం ఏర్పాటు చేశాం.

? పత్తిలో తేమను ఎలా నిర్ధారిస్తారు?
- సాగర్(తాంసి), సోనేరావు(బేల)

✔ మార్కెట్‌కు తీసుకొచ్చిన పత్తి వాహనంలో మూడు ప్రాంతాల్లో తేమను పరిశీలించి, వాటి సగటును నిర్ధారిస్తారు. వాహనం తూకమైన తర్వాత జిన్నింగ్‌లో వేసేటప్పుడు సీసీఐ అధికారులు తేమ శాతాన్ని పరిశీలిస్తారు. మార్కెట్‌లో లేదా జిన్నింగ్‌లో వచ్చిన తేమ శాతంలో ఏది తక్కువ ఉంటుందో దాన్ని ప్రామాణికంగా తీసుకుంటారు.

? కౌలు రైతులు పంటను విక్రయించుకోవాలంటే ఇబ్బందులు ఉన్నాయి.
- రమాకాంత్, తలమడుగు

✔ కౌలు రైతులు వ్యవసాయ విస్తరణ అధికారుల నుంచి ధ్రువపత్రం తీసుకొని రావాలి. ఇప్పటికే పత్రాలను ఏఈవోలకు సరఫరా చేశారు. వీళ్లతోపాటు పంటల సమగ్ర సర్వేలో పేర్లు నమోదు కాని వారు, పోడు భూముల్లో సాగు చేసే రైతులు కూడా పంటను సీసీఐకి విక్రయించుకోవాలంటే ధ్రువపత్రం తీసుకొని రావాలి.

డొక్కు బస్సులే దిక్కు!

- ఆర్టీసీలో సగం అద్దె వాహనాలే
- నిర్వహణ లేక తరచూ మొరాయింపు

ఈటీవీ - ఆదిలాబాద్

ఆదిలాబాద్ రీజియన్ ఆరు డిపోల పరిధిలో 620 బస్సులుంటే 311 అద్దెవి ఉన్నాయి. 309 సంస్థ బస్సులున్నాయి. ఆర్టీఏ నియమావళి ప్రకారం 15 ఏళ్లు దాటినా.. 13 లక్షల కిలోమీటర్ల వరకు తిరిగిన బస్సులను వినియోగించరాదనే నిబంధనలు ఆర్టీసీలో అమలు కావటం లేదు. రీజియన్ పరిధిలో 16 లక్షల కిలోమీటర్ల దాటిన 70 బస్సులను ఇంకా తిప్పుతూనే ఉన్నారంటే జిల్లాకు ఆ సంస్థ ఇస్తున్న ప్రాధాన్యం వెల్లడవుతోంది. ఇందులో నిర్ణీత గడువు ముగిసిన 30 నుంచి 40 బస్సులను స్క్రాప్‌కు పంపించాల్సి ఉన్నా సరిపడా కొత్త బస్సుల్లేక పాత వాటినే ఏదో రకంగా వినియోగించుకోవాల్సి వస్తోంది. అద్దె బస్సుల పరిస్థితిని చూసేవారేలేరు.


బైంసాలో మంగళవారం రాత్రి మహిళా కండక్టరు సెల్ ఫోన్ వెలుతురులో మరమ్మతులు చేస్తున్న డ్రైవర్, మెకానిక్

బైంసా డిపోలో 32 బస్సుల్లో 30 పాతవే

బైంసా: బైంసా డిపో పరిధిలోని బస్సులన్నీ పాతవే కావడంతో తరచూ మొరాయిస్తున్నాయి. డిపోలో సంస్థ బస్సులు 32 ఉండగా, వాటిలో 30 పాతవే. 47 అద్దె బస్సుల్లో కొన్నింటి పరిస్థితి అలాగే ఉంది. వాటి నిర్వహణ బాధ్యత సంబంధిత యాజమాన్యాలదే అయినా, వాటిని ప్రతిరోజు పరిశీలించి బస్టాండుకు పంపాల్సిన బాధ్యత డిపో అధికారులదే. తాజాగా ఎడ్‌బిడ్ సర్వీసు అద్దె బస్సు ఒకరోజు మూడు సార్లు మొరాయించింది. మంగళవారం రాత్రి సైతం బైంసా బస్టాండు దాటకుండానే సాంకేతిక కారణాలతో నిలిచిపోయింది. మెకానిక్‌లు వచ్చి మరమ్మతులు చేశారు. సాయంత్రం 6 వరకే విధులు నిర్వహించాల్సిన మహిళా కండక్టరు రాత్రి 9:30 గంటలకు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చి ఇంటికి వెళ్లాల్సి వచ్చింది.

ఉమ్మడి జిల్లాలోని బస్సుల వివరాలు..

రకం	ఆర్టీసీ	అద్దె
రాజధాని	08	--
లహరి(ఏసీ)	12	--
లహరి(నాన్‌ఏసీ)	14	--
సూపర్ లగ్జరీ	88	--
డీలక్స్	03	--
సెమీ డీలక్స్	04	--
ఎక్స్‌ప్రెస్	33	75
పల్లె వెలుగు	149	234



ఎక్కడపడితే అక్కడే ఆగిపోతూ..

ఆదిలాబాద్ బస్టాండు నుంచి బయలుదేరిన అయిదు నిమిషాలకే కొద్ది దూరంలోనే ఆర్టీసీ బస్సు ఆగిపోయింది. బస్సు నిండా ప్రయాణికులు ఉన్నారు. వారంతా తిరిగి కాలినడకన అవస్థలు పడుతూ బస్టాండ్‌కు మరో బస్సు కోసం వెళ్లారు. నిజామాబాద్‌కు వెళ్లాల్సిన ఆదిలాబాద్ డిపోకు చెందిన బస్సు మంగళవారం మరమ్మతులతో ఒక్కసారిగా ఆగిపోయింది. నిత్యం ఇలాగే జరుగుతున్నా పట్టింపు కరవైంది.

కొత్తవి రావడం లేదు

మంచిర్యాల డిపో పరిధిలో డొక్కు బస్సులు చాలానే ఉన్నాయి. ప్రయాణానికి అసలు పనికిరాని మూడు బస్సులను గుర్తించిన అధికారులు కరీంనగర్‌లోని సంస్థ స్క్రాప్ షెడ్డుకు పంపించాలని పక్కనపెట్టారు. వాటిస్థానంలో ఒకటే కొత్త బస్సును కేటాయించారు. ఈ దుస్థితి కేవలం మంచిర్యాల డిపోకే పరిమితం కాలేదు. ఆసిఫాబాద్, బైంసా డిపోల్లోనూ ఇలాగే ఉంది. కొత్తవాటిని కేటాయించడం లేదు.

అన్నింటిని పరిష్కరిస్తాం

- ప్రణీత్, డిప్యూటీ ఆర్ఎం



ఒక్కో సమస్యను పరిష్కరించే ప్రయత్నం జరుగుతోంది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా కొత్త బస్సుల కోసం ఉన్నతాధికారులకు లేఖ రాశాం. రీజియన్ పరిధిలోని పుణ్యక్షేత్రాలు, పర్యాటక కేంద్రాలకు సర్వీసులు తిప్పేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తాం.

అట్టహాసంగా గురుకులాల క్రీడోత్సవాలు ప్రారంభం

ఆదిలాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల ఉమ్మడి జిల్లాస్థాయి క్రీడోత్సవాలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. అండర్-14, 17 ఏళ్ల విభాగాల్లో ఆదిలాబాద్, బెల్లంపల్లి, ఈదుల్‌సావర్‌గాం, గన్నారం, జైనథ్, కాగజ్‌నగర్, ఖానాపూర్, లక్షెట్టిపేట, మంచిర్యాల, మందమర్రి, ముథోల్, సారంగాపూర్ గురుకులాలకు చెందిన బాలికలు హాజరయ్యారు. వీరు కబడ్డీ, ఖోఖో, క్యారమ్స్, వాలీబాల్, టెన్నికాయిట్, చదరంగం, అథ్లెటిక్స్ క్రీడాంశాల్లో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారు. ముఖ్య అతిథులుగా ఎంపీ గోడం నగేష్, అదనపు పాలనాధికారి శ్యామల దేవి హాజరై మాట్లాడారు. గెలుపోటములు సహజమేనన్నారు. క్రీడలతో ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారిణుల సంస్కృతి, సంప్రదాయాలు తెలుస్తాయన్నారు. అత్యుత్తమంగా ఆడాలని, జిల్లాకు, తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడోత్సవాలు అయిదు రోజుల పాటు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. డీసీసీబీ ఛైర్మన్ అడ్డి భోజారెడ్డి, కౌన్సిలర్ పవన్ నాయక్, గురుకులాల ఆర్సీవో గోపీచంద్, ప్రిన్సిపల్ కీర్తి, పీడీలు ఉన్నారు.


క్రీడాజ్యోతితో ఎంపీ నగేష్, చిత్రంలో అదనపు పాలనాధికారి శ్యామలదేవి, డీసీసీబీ ఛైర్మన్ భోజారెడ్డి, ఆర్సీవో గోపీచంద్, ప్రిన్సిపల్ కీర్తి



కంపుకొడుతున్నా.. పట్టింపు కరవు

జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణం జూడో హాలు పక్కనే ఉన్న మూత్రశాలలు, మరుగుదొడ్లు కొన్ని నెలలుగా నిర్వహణ సరిగా లేక కంపు కొడుతున్నాయి. దుర్వాసన భరించలేక అటువైపు వెళ్లేందుకు క్రీడాకారులు జంకుతున్నారు. రోజూ వేల మంది సాధకులు క్రీడా ప్రాంగణానికి వస్తుంటారు. ఒంటికి రెంటికి వస్తే ఇంటికి వెళ్తున్నామని వాపోతున్నారు. ఇక మహిళల పరిస్థితి మరీ దారుణంగా ఉందని, వెంటనే మూత్రశాలలు, మరుగుదొడ్లను బాగు చేసి ఉపయోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

- ఈనాడు, ఆదిలాబాద్
- న్యూస్‌టుడే, ఆదిలాబాద్ క్రీడావిభాగం

నీటి సరఫరాలో నిర్లక్ష్యంపై ఆగ్రహం

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : పట్టణంలోని మిషన్ భగీరథ నీటి సరఫరాలో తరచూ అవాంతరాలు ఏర్పడటంపై కౌన్సిలర్లు అధికారులపై మండిపడ్డారు. పట్టణంలోని ఫిల్టర్‌బెడ్‌లో బుధవారం మున్సిపల్ ఈఈ తిరుపతి, గ్రిడ్ ఈఈ గోపిచంద్‌తో కౌన్సిలర్లు కలాల్ శ్రీనివాస్, బండారిసతీష్, చందానర్సింగ్, ఆవుల వెంకన్నలు సమావేశమై సరఫరా తీరును చర్చించారు. తప్పిదం ఎక్కడ జరుగుతుందని ప్రశ్నించారు. నీళ్ల రాక ప్రజలు తమను ప్రశ్నిస్తున్నారన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు ఏమైనా కావాలంటే తమ దృష్టికి తేవాలని తప్పితే ఇక్కడ శాశ్వత పరిష్కారం చూపాల్సిందేనన్నారు. వాల్వ్ పాడైతే మరమ్మతులు ఎందుకు చేయించలేదన్నారు. విద్యానగర్, భుక్తాపూర్, సంజయ్‌నగర్ కాలనీలకు మునుపటిలాగే నిరంతరం నీరు అందించకపోతే మాత్రం ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. అనంతరం అక్కడికి వచ్చిన పుర కమిషనర్ ఖమర్ అహ్మద్‌తో కలిసి సరఫరాలో లోపాలను, సమస్యలను పరిశీలించారు. వివిధ కాలనీలకు చెందిన నాయకులు భూమన్న, మిషా, ఇమ్రాన్‌లున్నారు.


అధికారులపై మండిపడుతున్న కౌన్సిలర్లు కలాల్ శ్రీనివాస్, బండారి సతీష్, చందా నర్సింగ్

రేపు కార్మికుల 'చలో హైదరాబాద్'


ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : బల్దియా కార్మికుల కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సీఐటీయూ అనుబంధ తెలంగాణ మున్సిపల్ కార్మికులు, ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు దర్శనాల నగేష్ అన్నారు. హైదరాబాద్‌లోని సీడీఎంఏ కార్యాలయం ఎదుట మహాధర్నాకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ బుధవారం బల్దియా కమిషనర్ ఎండీ ఖమర్ అహ్మద్‌కు వినతిపత్రం అందించారు. స్వామి, జనార్దన్, అజీమ్, భోజు, షబ్బీర్, దయానంద్, కుమార్ తదితరులున్నారు.

ఉపకార వేతనాల కోసం ధర్నా

పాలనాప్రాంగణం: పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, బోధనా రుసుములను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి లెనిన్, జిల్లా కార్యదర్శి కేశవ్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

తరలింపుతో గతి తప్పిన ప్రగతి..

- ఉట్నూరు వీడుతున్న ముఖ్యశాఖలు
- అవస్థల్లో గిరిజనులు



న్యూస్‌టుడే, ఉట్నూరు

ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంతో ఉట్నూరులో సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఆ తరువాత ఐటీడీఏ ఆధీనంలోని ఏజెన్సీ డివిజన్ పరిధిలోని ఉట్నూరు, ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడ, సిరికొండ, జైనూర్, సిర్పూరు(యు), లింగాపూర్ మండలాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఇక్కడి చిన్న నీటి పారుదలశాఖ, సహాయ వ్యవసాయ సంచాలకులు(ఏడీఏ), జిల్లా మలేరియా అధికారి(డీఎంవో), పట్టు పరిశ్రమ శాఖ సంచాలకులు(ఏడీ), రోడ్డు, భవనాల డివిజన్ కార్యాలయాలను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా ఏజెన్సీ మండలాలలో అభివృద్ధి పనులు చేపట్టేవారు. సంక్షేమ పథకాలు అమలు చేసేవారు. ప్రస్తుతం ముఖ్యమైన ఆ శాఖలను ప్రభుత్వం మైదాన ప్రాంతాలకు తరలించింది.



చిన్ననీటి పారుదల శాఖ ఆదిలాబాద్‌కు

ఏజెన్సీ ప్రాంతంలో సాగునీటి పథకాలను వినియోగంలోకి తేవాలనే లక్ష్యంతో 1980లో ఐటీడీఏ కార్యాలయం ఉట్నూరులో చిన్ననీటి పారుదలశాఖ డివిజన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. ఈ శాఖ ఆధ్వర్యంలో ఏజెన్సీ మండలాలలోని చెరువులకు మరమ్మతులు, కొత్త చెరువుల నిర్మాణం, కుంటల తవ్వకాలు చేపట్టి రైతులకు సాగునీటి సమస్యను తీర్చేవారు. 2016లో ప్రభుత్వం నీటి పారుదల శాఖలో చేపట్టిన మార్పులతో ఉట్నూరులోని చిన్న నీటి పారుదల శాఖను మైదాన ప్రాంతమైన ఆదిలాబాద్‌కు తరలించి, నీటి పారుదల శాఖలో కలిపేసింది.



అందని వ్యవ'సాయం'

ఏజెన్సీ ప్రాంతంలోని సుమారు 50 వేలకు పైచిలుకు రైతులకు సంబంధించి 1.50 లక్షల ఎకరాలలో పండించే పంటలు, వ్యవసాయ సాగులో వచ్చే సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో ఉట్నూరులో ఏర్పాటు చేసిన సహాయ వ్యవసాయ సంచాలకుడి(ఏడీఏ) కార్యాలయాన్ని ప్రభుత్వం ఇచ్చోడకు తరలించింది. సహాయ వ్యవసాయ సంచాలకులు లేక రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.



మలేరియా తగ్గేదెలా?

ఏజెన్సీ ప్రాంతంలో కాలంతోపాటు కీటక జనిత వ్యాధులు విజృంభిస్తుంటాయని గుర్తించిన ప్రభుత్వం 1980లో ఇక్కడ జిల్లా మలేరియాధికారి కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. మూడు దశాబ్దాల పాటు ఇక్కడ సేవలందించిన కార్యాలయాన్ని ప్రభుత్వం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి తరలించింది. ఏజెన్సీలో మలేరియాధికారి లేక పర్యవేక్షణ కరవై మారుమూల గ్రామీణ ప్రాంతాలలో దోమలకాటుతో వచ్చే మలేరియా ఇతర వ్యాధులు పెరిగిపోయి ప్రజారోగ్యంపై ప్రభావం పడుతోంది.



రహదారుల నిర్మాణం కోసం ఉట్నూరులో ఏర్పాటు చేసిన రోడ్డు, భవనాల శాఖ డివిజన్ కార్యాలయాన్ని చెన్నూరుకు తరలించారు. ఆదివాసీ గిరిజనులకు సత్వర న్యాయం కోసం గతంలో ఇక్కడ ఏర్పాటు చేసిన సంచార న్యాయస్థాన వ్యవస్థను మూసేశారు. ఐటీడీఏ ఉట్నూరులో మంజూరుచేసిన ప్రత్యేక ఏజెన్సీ విద్యాధికారి పోస్టు, పట్టు పరిశ్రమల శాఖ సంచాలకుడి(ఏడీ) పోస్టును రద్దు చేశారు.


ఉపాధ్యాయుడు మేస్రం శేఖర్‌ను సాగనంపుతున్న విద్యార్థులు, గ్రామస్థులు

గ్రామస్థులంతా కదిలి.. సన్మానించి

గాదిగూడ మండలం సాంగ్వి ప్రాథమికోన్నత పాఠశాలలో 12 ఏళ్లుగా ఆదివాసీ విద్యార్థులకు చదువు నేర్పిన మేస్రం శేఖర్‌కు ఇటీవల అదే మండలంలోని అర్జునీ గోండ్‌గూడ పాఠశాలకు బదిలీ అయింది. బుధవారం ఆయనను గ్రామస్థులు, విద్యార్థులు కలిసి సన్మానించారు. ఆదివాసీలు, విద్యార్థులు కన్నీరు పెట్టుకున్నారు. అంతా కలిసి ఊరి చివరి వరకు వచ్చి వీడ్కోలు పలికారు. ఉపాధ్యాయులు మేస్రం లింగు, గంగాధర్, బాదిరావు, విద్యార్థి సంఘ ప్రధాన కార్యదర్శి పెందోర్ సంతోష్, గ్రామ పెద్ద అర్క హన్మంత్‌రావు పటేల్, పాఠశాల ఛైర్మన్ మడావి బాదిరావు, విద్యార్థులు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, నార్నూర్(గాదిగూడ)**


నేడు ఆదిలాబాద్‌లో కేటీఆర్ బహిరంగ సభ

ఆదిలాబాద్ పట్టణం, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని ఆదిలాబాద్‌లో గురువారం నిర్వహించే నిరసన సభకు భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ రానుండటంతో ఆ పార్టీ నాయకులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. పట్టణంలోని రాంలీల మైదానంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సభకోసం భారీ జన సమీకరణ చేపట్టేలా కార్యాచరణ రూపొందించారు. ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి మాత్రమే ప్రజలు హాజరయ్యేలా చూస్తున్నారు. ఇందులో గ్రామీణ ప్రాంతాల నుంచి ఎక్కువ మొత్తంలో రైతులు తరలివచ్చేలా పార్టీ నేతలకు ఆదేశాలిచ్చారు. ఉమ్మడి జిల్లాలోని ముఖ్య నేతలందరికి ఆహ్వానమందించారు. మాజీ మంత్రి జోగు రామన్న సభా ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరుకావాలని కోరారు. మున్సిపల్ ఛైర్మన్ జోగు ప్రేమేందర్, పట్టణ అధ్యక్షుడు అజయ్ తదితరులున్నారు.


సభా ఏర్పాట్లు పరిశీలిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

పాఠశాలల సందర్శన

జైనథ్, బేల, న్యూస్‌టుడే : జైనథ్ మండలం దీపాయిగూడ ఉన్నత పాఠశాలతో పాటు కేజీబీవీ పాఠశాలలను జిల్లా విద్యాధికారి ప్రణీత బుధవారం సందర్శించారు. ఎస్ఏ-1 పరీక్ష నిర్వహణ, పదో తరగతి విద్యార్థుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. దీపాయిగూడలో కిచెన్‌గార్డెన్‌ను చూసి అభినందించారు. సీసీ రాజేశ్వర్, ప్రధానోపాధ్యాయుడు విజయసారధి, ప్రత్యేకాధికారి వీణాకుమారి ఉన్నారు. బేల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని డీఈవో తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్‌లు పరిశీలించారు. విద్యాలయం పరిసరాలు, వంటగదిని పరిశీలించారు. సీఆర్టీలకు పలు సూచనలు చేశారు.



యువతుల స్ఫూర్తి.. చైతన్య దీప్తి

● పశువైద్యాధికారులుగా కొలువులు

ఆడపిల్ల గడప దాటకూడదు. అది గతం. ఆకాశమే హద్దు ఇది ప్రస్తుతం. రంగమేదైనా.. పోటీ ఎంతైనా.. అవకాశాలు అందిపుచ్చుకుంటూ అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. వ్యవసాయ కుటుంబాల నుంచి వచ్చిన వారే అయినా కష్టపడి చదివారు. అనుకున్న లక్ష్యాన్ని సాధించారు.. పశువైద్యులుగా ఎంపికయ్యారు. ఉమ్మడి జిల్లాలో 18 మంది పశువైద్యాధికారులుగా బాధ్యతలు తీసుకోగా, అందులో పది మంది మహిళలు ఉన్నారు. వారి విజయగాథపై ప్రత్యేక కథనం. -న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం :

మూగజీవాల బాధ కదిలించింది..

-లావణ్య, ఆదిలాబాద్



ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం కుచులాపూర్‌కు చెందిన లావణ్యది వ్యవసాయ కుటుంబం. చిన్నప్పటి నుంచి చదువులో చురుగ్గా ఉండే వారు. అయిదో తరగతిలో నవోదయకు ఎంపికయ్యారు. గతంలో వారికి డెయిరీ ఉండటంతో పశువులకు వచ్చే వ్యాధుల పట్ల కొంత అవగాహన ఉంది. అప్పట్లో వాటికి చికిత్స చేసేందుకు వచ్చే వైద్యులు, వారి సేవలను గమనించిన లావణ్య పశు వైద్యాధికారి కావాలని అనుకున్నారు. ఆ దిశగా చదువుకొని కళాశాలలో సీటు పొందారు. టీఎస్‌పీఎస్సీ పరీక్ష రాసి పశువైద్యాధికారిగా ఎంపికయ్యారు. "చిన్నప్పుడు గ్రామంలో వందల సంఖ్యలో మూగజీవాలు ఉండేవి. వాటికి వచ్చే వ్యాధుల గురించి గ్రామస్థులకు అవగాహన లేక సకాలంలో చికిత్స చేయక కొన్ని చనిపోయేవి. వాటి బాధ నాలో ఆలోచన కలిగించింది. అందుకే పశువైద్యాధికారి కావాలని అనుకున్నాను. సాధించానంటున్నారు లావణ్య".

ఉన్నత స్థానానికి చేరుకోవాలని..

-అంజలి, కుమురం భీం



కుమురం భీం జిల్లా కౌటల మండలం ముత్యంపేట పశువైద్యశాలలో అంజలి పశువైద్యురాలిగా బాధ్యతలు తీసుకున్నారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన ఈమె పదో తరగతి వరకు మంచిర్యాలలో చదివారు. ఇంటర్ ప్రైవేట్ పాఠశాలలో చదివారు. తర్వాత ఎంట్రెన్స్ రాయడంతో బీవీఎస్సీలో సీటు రావడంతో హైదరాబాద్‌లో అయిదేళ్ల పాటు చదివారు. తర్వాత పీజీ చేసేందుకు కేరళకు వెళ్లారు. టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ రావడంతో పీజీ మధ్యలో వదిలేసి సాధన చేసి మంచి మార్కులతో పాసై పశువైద్యురాలిగా ఎంపికయ్యారు. "ఉన్నత స్థానానికి చేరుకోవాలనే లక్ష్యంతో పట్టుదలతో చదవడంతోనే ఇది సాధ్యమైంది. మూగజీవాలంటే ఇష్టం. వాటికి సేవ చేయాలనే ఆశయంతో బీవీఎస్సీ కోర్సులో చేరాను. వాటికి వైద్యం అందించి కాపాడేందుకు ప్రయత్నిస్తానంటున్నారు అంజలి".

సేవతోనే సంతృప్తి..

-సంధ్యారాణి, మంచిర్యాల



మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలానికి చెందిన సంధ్యారాణి వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చారు. పదో తరగతి వరకు కిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాలలో చదివారు. తర్వాత ఇంటర్ పూర్తి చేసి ఎంట్రెన్స్ రాయడంతో బీవీఎస్సీలో సీటు వచ్చింది. అయిదేళ్ల కోర్సు పూర్తి చేసుకున్న ఏడాదికి టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ జారీ అయింది. పరీక్ష రాసి పాసై పశువైద్యాధికారిగా ఉద్యోగం వచ్చింది. 'నోరు లేని మూగజీవాలకు సేవ చేయడంలోనే సంతృప్తి ఉంది. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి ఉద్యోగం చేయాల్సి ఉంటుంది. ఆడపిల్లలకు కష్టం అవుతుందని చాలా మంది చెప్పారు. అయినా గ్రామీణ ప్రాంతాల్లో పశువైద్యం అందించాలనే లక్ష్యంతో ఉద్యోగంలో చేరానంటున్నారు సంధ్యారాణి".

ఏడేళ్లు వేచి చూశా...

- ప్రియాంక, నిర్మల్



నిర్మల్ జిల్లా లక్ష్మణచాందకు చెందిన ప్రియాంక పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివారు. ఎక్కువ మార్కులు రావడంతో ఇంటర్ విద్యను ఉచితంగా ఓ కళాశాల అందించడంతో పూర్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పుట్టి పెరగడంతో వ్యవసాయం, పశువులపై అవగాహన ఉండేది. కష్టపడి బీవీఎస్సీ (బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్) కోర్సులో చేరి పూర్తి చేశారు. ప్రభుత్వం పశువైద్యుల పోస్టులు భర్తీ చేయకపోవడంతో ఒప్పంద పద్ధతిలో నిర్మల్ జిల్లాలో ఏడేళ్ల పాటు పని చేశారు. తర్వాత టీఎస్‌పీఎస్సీ పరీక్ష రాసి పశువైద్యాధికారిగా ఎంపికయ్యారు. "మూగజీవాలపై ప్రేమతోనే ఈ వృత్తిని ఎంచుకున్నాను. బీవీఎస్సీ పూర్తి చేసుకున్న తర్వాత నోటిఫికేషన్ రాక ఏడేళ్లు పలు మండలాల్లో పని చేశాను. పశువులకు వచ్చే వ్యాధులు, ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన ఉంది. ఇష్టంగా చేస్తే.. ఏ వృత్తి అయినా.. కష్టమేమి అనిపించదంటున్నారు

ఇన్‌స్పైర్‌లో మనోళ్ల జోరు!

● మంచిర్యాల రెండు, కుమురంభీం జిల్లాకు నాలుగో స్థానం

● ఉమ్మడి జిల్లాలో 3,533 రిజిస్ట్రేషన్లు

న్యూస్‌టుడే, ఆసిఫాబాద్ అర్బన్

ఇన్‌స్పైర్ మనక్ 2024-25 ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లలో మన విద్యార్థులు ఉత్సాహం కనబరిచారు. ఉమ్మడి జిల్లా నుంచి ఏకంగా 3,533 ప్రాజెక్టుల కోసం నామినేషన్లు నమోదయ్యాయి. 92.2 శాతంతో మంచిర్యాల రాష్ట్రంలో రెండో స్థానం, 88.1 శాతంతో కుమురం భీం జిల్లా నాలుగో స్థానంలో నిలిచింది. 2023-24లో నమోదైన ప్రాజెక్టుల్లో కుమురం భీం జిల్లా నుంచి 108 జిల్లా స్థాయి ప్రదర్శనకు ఎంపిక కాగా వచ్చే నెలలో ప్రదర్శించేందుకు సిద్ధమవుతున్నారు.



జూన్‌లో ఇన్‌స్పైర్ మనక్ జాతీయ పోటీల్లో పాల్గొన్న అక్షర పటేల్

కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక అభివృద్ధి మంత్రిత్వశాఖ ఏటా దేశ వ్యాప్తంగా నిర్వహించే ఇన్‌స్పైర్ (ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ పర్స్యూట్ ఫర్ ఇన్‌స్పైర్డ్ రీసర్చ్), మనక్ (మిలియన్ మైండ్స్ అడ్వంటింగ్ నేషనల్ ఆస్పిరేషన్ అండ్ నాలెడ్జ్) విద్యార్థుల్లో సృజనకు పదును పెడుతోంది. నిత్యం జీవితంలో ఎదురయ్యే సమస్యలకు వారు చూపించే పరిష్కారాల ప్రాజెక్టుల రిజిస్ట్రేషన్లను ఆన్‌లైన్‌లో ఆహ్వానిస్తోంది. జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఎంపికైన ప్రాజెక్టుల్లో అత్యుత్తమమైన వాటిని జాతీయ పోటీలకు ఎంపిక చేస్తుంది. జాతీయ స్థాయిలో ఎంపికైన వాటిని జపాన్‌లో జరిగే అంతర్జాతీయ సుకురా ప్రదర్శనలకు పంపుతారు.

ఎంపిక ఇలా..

జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఉన్నత పాఠశాలల్లో చదివే 6-10 తరగతుల విద్యార్థులు అర్హులు కాగా.. ప్రతి పాఠశాల నుంచి 5 ప్రాజెక్టులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. ఇందులో నుంచి 10శాతం ఉత్తమ ప్రాజెక్టులుగా ఎంపిక చేస్తారు. ఎంపికైన విద్యార్థుల బ్యాంకు ఖాతాలో ప్రాజెక్టు తయారీ ఖర్చుల కోసం రూ.10వేల చొప్పున జమచేస్తారు. గైడ్ టీచర్ సహాయంతో విద్యార్థులు దీన్ని సిద్ధం చేసి జిల్లా స్థాయి పోటీల్లో ప్రదర్శించాలి. జిల్లా స్థాయి ప్రదర్శనల్లో 11 ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి రాష్ట్ర స్థాయికి పంపించనున్నారు.

ఈసారి ప్రదర్శనలకు ఎంపికైన ప్రాజెక్టులు

ఆదిలాబాద్ 63	నిర్మల్ : 128
కుమురంభీం 108	మంచిర్యాల 149

ఇదీ ప్రయోజనం

జాతీయ స్థాయిలో జ్యూరీని ఆకట్టుకొని ఎంపికయ్యే అత్యుత్తమ 60 ప్రాజెక్టుల విద్యార్థులకు రాష్ట్రపతి స్థాయిలో గుర్తింపు లభిస్తుంది. ఈ విద్యార్థులకు రాష్ట్రపతి భవన్‌లో విందు ఏర్పాటు చేస్తారు. వీరి ప్రాజెక్టులకు పేటెంట్ హక్కును కల్పిస్తారు. వీరికి దేశంలో పేరున్న ఐఐటీల్లో ప్రవేశాలకు రిజర్వేషన్ కల్పిస్తారు.

జాతీయ స్థాయిలో మెరిసిన విద్యార్థులు

గతేడాది నవోదయ విద్యాలయానికి చెందిన 9వ తరగతి విద్యార్థిని ముకుం అక్షర పటేల్ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంది. వరిగడ్డి కాల్చి వాయు కాలుష్యానికి కారణం కాకుండా ఆ గడ్డితో మొక్కలు పెంచే కుండీల తయారీకి వినియోగించవచ్చని నిరూపించే ప్రాజెక్టుతో ఆకట్టుకుంది.

ఉమ్మడి జిల్లాలో నమోదైన ఇన్‌స్పైర్ నామినేషన్లు

జిల్లా	మంచిర్యాల	కుమురం భీం	నిర్మల్	ఆదిలాబాద్
నామినేషన్లు	1308	768	894	563
శాతం	92.2	88.1	71.6	37.3

● జిల్లా ● నామినేషన్లు ● శాతం

వచ్చే నెలలో ప్రదర్శనలు

కటుకం మధుకర్, జిల్లా సైన్సు అధికారి, కుమురంభీం

ఈ సారి జిల్లా నుంచి 768 ప్రాజెక్టులు నమోదవడం సంతోషకరం. వచ్చే నెల మూడో వారంలో జిల్లా స్థాయి ప్రదర్శన పోటీలు ఉంటాయి. ప్రధానోపాధ్యాయులు, గైడ్ టీచర్లు ఈ విషయంలో తగు శ్రద్ధ తీసుకోవాలి.

నేడు ఏనుగు పండగ

● మహారాష్ట్ర సరిహద్దులో కొనసాగుతున్న సంప్రదాయం

న్యూస్‌టుడే, బేల :

దీపావళికి ముందు వచ్చే అష్టమి రోజు ఆదిలాబాద్ జిల్లావాసులు ఏనుగును పూజిస్తారు. గజేంద్రుడ్ని దైవంగా భావించి తరాలుగా పూజిస్తున్నారు. మహారాష్ట్ర సరిహద్దులో ఉండే బేల, జైనథ్, తాంసి మండలాల్లో ఈ ఆచారం కనిపిస్తుంది. ఆయా మండలాల్లోని మరాఠీ భాష మాట్లాడే ప్రజలు ఈ సంప్రదాయాన్ని తరాలుగా కొనసాగిస్తున్నారు. బహుళ అష్టమి నాడు ఏనుగు ప్రతం నిర్వహిస్తారు. మట్టితో ఏనుగు ప్రతిమలు తయారు చేస్తారు. గురువారం ఈ పండగను నిర్వహించనున్నారు.



మట్టితో తయారు చేసిన ఏనుగు విగ్రహం

ఎందుకు పూజిస్తారు..

ఈ పండగ వెనుక ఓ పౌరాణిక గాథ ఉందంటారు. ఒకసారి పార్వతీదేవి శివుడిపై అలిగి కైలాసం వదిలి వెళ్లిపోయిందట. కొన్ని రోజుల తర్వాత శివుడు ఏనుగు(గజేంద్రుడు)ను పంపి పార్వతీ దేవిని రమ్మని అన్నాడట. అప్పుడు పార్వతీ దేవి సంతోషంతో గజేంద్రుడిపై కూర్చొని తిరిగి శివుడి దగ్గరకు కైలాసానికి వచ్చిందట. ఈ అష్టమి నాడు ఏనుగును పూజిస్తే పార్వతీదేవి అనుగ్రహం లభిస్తుందని భక్తుల విశ్వాసం. ఐశ్వర్యాలు, సంపూర్ణ ఆరోగ్యం కలుగుతాయని భావిస్తారు. నియమ నిష్ఠలతో ఏనుగును పూజిస్తారు.

తాళసప్తమి వేడుకలు ప్రారంభం



సప్తమి వేడుకల్లో భజన చేస్తున్న భజనకారులు

కుభీరు: మండలంలోని పార్డి(కె) గ్రామ హనుమాన్ ఆలయంలో వారం రోజుల పాటు నిర్వహించే తాళసప్తమి వేడుకలు బుధవారం ప్రారంభమయ్యాయి. అర్చకులు ఆలయంలోని హనుమంతుడి ప్రతిమకు అభిషేకం, ప్రత్యేకపూజలు చేశారు. భజనకారుల భజనల మధ్య సప్తమి వేడుకలు ప్రారంభించారు. గ్రామస్థులు వంతుల వారీగా సప్తమి వేడుకల్లో పాల్గొంటారు. ప్రతిరోజు రాత్రి ప్రముఖ మహారాజ్‌ల కీర్తన, రాత్రికి అన్నదానం, హరిపాఠ్ పారాయణం, కాగడా హారతి నిర్వహిస్తారు. ఈనెల 30న ముగింపు వేడుకలు గ్రామంలో శోభాయాత్ర, ఉట్టిపగులగొట్టే కార్యక్రమం, మహాప్రసాదం ఉంటుందని ఆలయకమిటీ అధ్యక్షుడు బందెల శంకర్ తెలిపారు. మాజీ సర్పంచి ఆకుల గంగాధర్, ఆలయకమిటీ ప్రతినిధులు గంటా రాములు, లంక పోశెట్టి, మరాఠి బాబు, ఆకుల వెంకటి, గోజల గజ్జారాం, లంక సురేశ్, భజనకారులు పాల్గొన్నారు.

ఆలోచన అదిరే.. చిత్రాలతో మెరిపించే

● అధునాతన యంత్ర సహకారం.. అబ్బురపర్చే పనితనం

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే:

చేసే పనిలో నిబద్ధత.. కొత్తదనం కోసం ప్రయత్నిస్తే మంచి ఫలితాలు వస్తాయి. అలా వినూత్న పంథాలో వెళ్లి సరికొత్త రూపంలో చిత్రాలు వేస్తూ అబ్బురపరుస్తున్నారు నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన పోతుల శ్రీనివాస్. ఎంబ్రాయిడరీలో రంగురంగుల దారాలతో ఆధునిక యంత్రంపై వీటిని తీర్చిదిద్దుతున్నారు. ఒక్కో చిత్రానికి గంటల సమయం పడుతున్నా తనలోని కళాత్మక ధోరణితో వాటిని తయారు చేస్తున్నారు. ఇప్పటికే పలువురు ప్రముఖుల చిత్రాలు రూపొందించి వాటిని వారికి అందజేసి ప్రశంసలు సైతం అందుకున్నారు.

ఉపాధి నిమిత్తం

ఖమ్మం జిల్లా వైరాకు చెందిన పోతుల శ్రీనివాస్ టైలరింగ్ వృత్తిలో ఉపాధి నిమిత్తం 20 ఏళ్ల క్రితం నిర్మల్ పట్టణానికి వచ్చారు. భార్య అనిత ఈయనకు తోడ్పాటుగా నిలిచారు. కాలానికి అనుగుణంగా తమ వృత్తిలోనూ మార్పులు అందిపుచ్చుకుంటూ ఎంబ్రాయిడరీ చేసే చిన్న యంత్రాన్ని కొనుగోలు చేశారు. దానిపై జాకెట్లకు వివిధ ఆకృతుల్లో ఎంబ్రాయిడరీ చేసేవారు. రెండేళ్ల క్రితం సరికొత్తగా వచ్చిన మరో మిషన్ కొన్నారు. దానిపై ఎంబ్రాయిడరీతోపాటు చిత్రాలు వేయొచ్చు. ఆ పనిపై అవగాహన, శిక్షణ పొంది ఏడాది క్రితం ఫొటోలు వేయడం ప్రారంభించారు.

ఒక్కో చిత్రానికి 16-18 గంటలు

నాణ్యమైన పట్టు వస్త్రాలపై చిత్రాలను వేస్తున్నారు. ఒక్కటి తయారు కావాలంటే సుమారు 16-18 గంటల సమయం పడుతుంది. ఇందుకు ఎంతో శ్రమిస్తున్నారు. ఏ మాత్రం అశ్రద్ధగా ఉన్నా శ్రమ వృథా అయ్యే ప్రమాదం ఉంటుందని శ్రీనివాస్ చెబుతున్నారు. అందుకే దగ్గరుండి మరీ పర్యవేక్షిస్తూ వాటిని తయారు చేస్తున్నారు. భార్యతోపాటు కుమారులు డిగ్రీ పూర్తి చేసిన కార్తిక్, మాధ్యమిక విద్యనభ్యసిస్తున్న అఖిల్ సాయం చేస్తున్నారు. ఏడాది కాలంలో ఇప్పటి వరకు సుమారు 105 చిత్రాలు వేశారు.




యంత్రం వేస్తున్న చిత్రాన్ని దగ్గరుండి పర్యవేక్షిస్తున్న శ్రీనివాస్

ప్రముఖుల ప్రశంసలు..

సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ, తెలంగాణ ఉప ముఖ్యమంత్రులు భట్టి విక్రమార్క, పవన్‌కల్యాణ్, మంత్రి సీతక్క, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాస్ ఇలా ఎందరివో చిత్రాలు వేశారు. ఆయనలోని కళను గుర్తించి ఇప్పటికే ప్రముఖుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. నాణ్యమైన సిల్క్‌పై చిత్రం వేయడంతో శాశ్వతంగా ఉంటాయని శ్రీనివాస్ చెబుతున్నారు. త్వరలో ప్రదర్శన ఏర్పాటు చేసే ఆలోచన ఉందని పేర్కొన్నారు. ఒక చిత్రం వేసే సమయంలో అనేక జాకెట్లకు ఎంబ్రాయిడరీ చేసి డబ్బు సంపాదించవచ్చని, కానీ ఈ కళపై ఆసక్తితో పలు గంటలు శ్రమిస్తున్నానని, తన పనికి లభిస్తున్న ప్రశంసలే తనకు ఇంధనమవుతోందని చెప్పారు.



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటం



తల్లితో ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటం

పాఠశాలలకు పాలు సరఫరా చేయాలి: పీవో



లవణ మిశ్రమ ప్యాకెట్‌ను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

నిర్మల్, న్యూస్‌టుడే: ఐటీడీఏ నిర్వహిస్తున్న పాఠశాలలకు పాలు సరఫరా చేయాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా డెయిరీ నిర్వాహకులను కోరారు. బుధవారం నిర్మల్‌లోని విజయ పాల కేంద్రాన్ని సందర్శించారు. సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ సహకారంతో తెలంగాణలోని సహకార రంగంలో పర్యావరణహితంగా ఏర్పాటుచేసిన లవణ కర్మాగారం, పాల ప్యాకింగ్ యూనిట్లను పరిశీలించారు. గిరి విజయమిన్ ప్లాంటు నిర్వహిస్తున్న బృంద సభ్యులు చందు, మానసలను లవణ మిశ్రమ తయారీ, అమ్మకాలను అడిగి తెలుసుకున్నారు. విజయ పాల ప్యాకింగ్ ప్లాంటును సందర్శించి ఐటీడీఏ ద్వారా నలుగురు గిరిజన యువతకు నియామక పత్రాలు అందజేసి ఉపాధి కల్పించారు. రోజూ వారీ పాల సేకరణ, ప్యాకింగ్ సమాచారం, రైతులకు అందజేస్తున్న దాణా, లవణ మిశ్రమం, గడ్డి విత్తనాలను పరిశీలించారు. త్వరలో కాగజ్‌నగర్‌లో బల్క్ కూలింగ్ యూనిట్ ప్రారంభిస్తున్నామని చెప్పారు. అనంతరం జీసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సోఫీనగర్‌లోని పెట్రోల్ బంక్‌ను సందర్శించారు. జేడీఎం నాగభూషణం, పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ బాలిక్ అహ్మద్, జీసీసీ డీఎం రామానందం, విజయ డెయిరీ డీడీ మధుసూదన్, మేనేజర్ దస్రునాయక్, గజ్జారాం, సంతోష్, కాంతారావ్, పంపిణీదారులు రమణారెడ్డి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

28న జిల్లాకు బీసీ కమిషన్ బృందం రాక

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : ఈ నెల 28న బీసీ కమిషన్ బృందం ఆదిలాబాద్ జిల్లాకు రానుందని కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. జడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 వరకు కమిషన్ ఛైర్మన్ నిరంజన్ నేతృత్వంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపడతారని పేర్కొన్నారు. ఆదిలాబాద్‌తో పాటు నిర్మల్, మంచిర్యాల, కుమురంభీం జిల్లాల కుల సంఘాల ప్రతినిధులు హాజరుకావాలని కోరారు. రాతపూర్వకంగా అభ్యర్థనలు నిర్ణీత నమూనాలో తగు సమాచారంతో సమర్పించవచ్చని పేర్కొన్నారు. కమిషన్ సభ్యులు బుధవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించగా.. పాలనాధికారితో పాటు అదనపు పాలనాధికారి శ్యామలదేవి, బీసీ సంక్షేమాధికారి రాజలింగు పాల్గొన్నారు.

వైద్యుల నియామకానికి 29న ముఖాముఖి

ఆదిలాబాద్ వైద్య విభాగం: ఆదిలాబాద్ రాజీవ్ గాంధీ వైద్య విజ్ఞాన సంస్థ(రిమ్స్)లోని వివిధ విభాగాల్లో ఒప్పంద ప్రాతిపదికన ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ట్యూటర్లు, సీఎంఓ/సీఏఎస్ పోస్టులను భర్తీ చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిమ్స్ సంచాలకుడు డాక్టర్ రాఠోడ్ జైసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ నిజ ధ్రువపత్రాలతో పాటు రెండు సెట్ల జిరాక్స్ ప్రతులతో వాక్ ఇన్ ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. నియామకాలను మెరిట్, ఆర్ఓఆర్ నిబంధనల మేరకు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. వాక్ ఇన్ ఇంటర్వ్యూలు ఈ నెల 29న ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 వరకు కొనసాగుతాయన్నారు. ఆయా విభాగాల్లో భర్తీ చేయనున్న వైద్యుల వివరాల కోసం adilabad.telangana.gov.in లేదా rimsadil-abad.org వెబ్‌సైట్లను సందర్శించాలని సూచించారు. వివరాల కోసం 98480 57606 నెంబరును సంప్రదించాలన్నారు.

విద్యార్థి నాయకురాళ్లు!

● బోథ్ గురుకులంలో నైపుణ్యాల పెంపునకు ప్రత్యేక తర్ఫీదు

న్యూస్‌టుడే, బోథ్ :

విద్యార్థినులు నాయకురాళ్లుగా మారుతున్నారు. ఇదేమిటని ఆలోచిస్తున్నారా? అక్షరాల నిజం. సాధారణంగా గురుకుల విద్యార్థులు చదువులో, ఆటల్లో రాణించడం చూస్తుంటాం. విద్యతో పాటు విభిన్న రంగాల్లో రాణించేలా నైపుణ్యాలు పెంపొందిస్తూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేస్తున్నారు ఆ పాఠశాల ఉపాధ్యాయులు.

బోథ్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో వినూత్న విధానాలను పాటిస్తూ భావిభారత పౌరుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారు. విద్యార్థి దశలోనే వారిలో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తున్నారు. ఈ గురుకులంలో 634 మంది విద్యనభ్యసిస్తున్నారు. చాలా మంది గ్రామీణ ప్రాంత నిరుపేదలే. వారిలో నాయకత్వ లక్షణాలను గుర్తించారు పాఠశాల ఉపాధ్యాయులు. గురుకులంలో చురుగ్గా ఉన్న విద్యార్థినులలో నాయకత్వ లక్షణాలను గుర్తించి వారిని ఓ కమిటీగా ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులు పాఠశాలలోని భోజన సదుపాయాలను, విద్యార్థినుల సమస్యలను, కిచెన్‌గార్డెన్, పాఠశాల స్వచ్ఛతలను పర్యవేక్షిస్తారు. వీటితో పాటు ఉదయం సమయంలో విద్యార్థుల్లో భయం పోగొట్టేందుకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు ఓ రెండు నిమిషాలు విద్యార్థిని ఓ విషయంపై భయం లేకుండా అనర్గళంగా మాట్లాడేలా శిక్షణ అందిస్తున్నారు. పాఠశాలలోని విద్యార్థి నాయకులు ఇతర పిల్లలు చదువు, వైద్యం, సమయపాలన, వ్యక్తిగత శుభ్రత, ఆటపాటల్లో రాణించేలా శిక్షణనిస్తున్నారు. ఉపాధ్యాయులు తరగతి గదికి గైర్హాజరైన సమయంలో విద్యార్థి నాయకులు ఆ సమయాన్ని ఉపయోగించుకుంటున్నారు. ఉపాధ్యాయులుగా మారి తరగతి గదిలో తోటి విద్యార్థులు పలు విషయాలపై అవగాహన కల్పిస్తున్నారు. గురుకులంలో ఈ ప్రత్యేక కార్యాచరణ విద్యార్థినుల్లో మార్పు తీసుకొచ్చిందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.



బోథ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో తోటి విద్యార్థులతో మాట్లాడుతున్న బృంద నాయకురాలు

చదువుతో పాటు నాయకత్వం

- హాసిని



మా గురుకులంలో తోటి విద్యార్థినుల సమస్యల పరిష్కారానికి బృంద నాయకురాలిగా కృషి చేస్తున్నాను. నేను చదువుకుంటూనే ఉదయం, సాయంత్రం వేళల్లో మిగతా విద్యార్థులకు సహాయం చేస్తున్నాను. విద్యార్థినులతో కలిసి పోయి ఉపాధ్యాయులకు, విద్యార్థినులకు వారధిగా నిలుస్తున్నాను. వెనుకబడిన పాఠ్యాంశాల్లో మెరుగైన మార్కులు సాధించేలా కృషి చేస్తున్నాను. విద్యార్థినులు అనారోగ్యం బారిన పడితే వైద్య సిబ్బంది దగ్గరికి తీసుకువెళతాను.

ఆటలు, సాంస్కృతిక పోటీల్లో రాణించేలా

- జి.రుతుమన్న



గురుకులంలో ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆసక్తి గల విద్యార్థినులను గుర్తించి ఉపాధ్యాయుల సహకారంతో ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నాం. సెలవు దినాలలో విద్యార్థినులకు నృత్యాలు నేర్పిస్తున్నాం. పలు ప్రత్యేక కార్యక్రమాల్లో విద్యార్థినులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణిస్తున్నారు. చదువులో సైతం వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, వారి అనుమానాలను నివృత్తి చేస్తున్నా.

సమష్టి కృషితో ముందుకు..

- సంగీత, ప్రిన్సిపల్, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, బోథ్

పాఠశాలలో సమష్టి కృషితో ముందుకు వెళుతున్నాం. విద్యార్థినులను ఆదర్శ నాయకులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం. నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు కమిటీని ఏర్పాటు చేసి వారికి పలు బాధ్యతలను అప్పగించాం. టీం లీడర్లు పాఠశాలలోని బాలికలను సమన్వయం చేస్తూ ముందుకు సాగుతున్నారు. పాఠశాలలోని సమస్యలను సైతం మా దృష్టికి తీసుకొస్తుండటంతో పరిష్కారానికి కృషి చేస్తున్నాం. ఈ విధానం సత్ఫలితాలనిస్తోంది.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

ఆదిలాబాద్: 91541 18155
ఇచ్చోడ: 94935 57309
బోథ్: 91548 46671
ఉట్నూరు: 94410 86640

న్యూస్‌టుడే, గుడిహత్నూర్ :

? గుడిహత్నూర్ మండలం శంతాపూర్‌లో రెండు పడకల గదుల నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి.
- తిరుమలేగౌడ్, మాజీ సర్పంచి శంతాపూర్

✔ క్షేత్రస్థాయిలో పరిశీలించి రెండు పడకల గదుల నిర్మాణ పనులను త్వరలో పూర్తి చేయిస్తాం. - అబ్దుల్ హై, ఎంపీడీఓ గుడిహత్నూర్

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ అర్బన్:

? ఆదిలాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ కూడలి నలువైపులా పాద బాట(ఫుట్‌పాత్)పై వ్యాపారులు సామగ్రి పెట్టుకోవడంతో ప్రజలకు ట్రాఫిక్ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- మునేశ్వర్, ప్రైవేటు ఉద్యోగి

✔ పట్టణంలో పాదబాటలపై వ్యాపారాలను తొలగించేలా చర్యలు తీసుకుంటాం. - ఎండీ ఖమర్ అహ్మద్, పుర కమిషనర్

పంతం నెగ్గించుకున్న కాంగ్రెస్ నేత సుగుణ


ఆత్రం సుగుణ

రూ.36 లక్షలతో 8 పనులు మంజూరు

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ పట్టణం: కాంగ్రెస్ పార్టీ నేత ఆత్రం సుగుణ నిధుల మంజూరులో తన పంతం నెగ్గించుకున్నారు. రూ.36 లక్షలతో ఎస్‌డీఎఫ్ పనులు మంజూరు చేయించుకున్నారు. ఆదిలాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఆమె తన కోసం ఎన్నికల్లో పని చేశారని నేరడిగొండ మండలంలో కార్యకర్తల సూచన మేరకు ఆగస్టులో కొన్ని పనులను ప్రతిపాదించిన విషయం తెలిసిందే. ప్రత్యేక అభివృద్ధి నిధి(స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్) కింద వివిధ అభివృద్ధి పనుల కోసం ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క ఆమోదం తీసుకున్నారు. తీరా ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయం నుంచి వర్క్‌ఆర్డర్ ఇచ్చే సమయంలో బోథ్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ఆడే గజేందర్ జోక్యం కల్పించుకొని విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఒత్తిడి తెచ్చి ఆ పనుల ప్రతిపాదనలు ఆపించారు. ఇది కాంగ్రెస్‌లో చర్చకు తెరతీసింది. అనంతరం ఆత్రం సుగుణ పనుల ఆమోదం కోసం పట్టుబట్టినట్లు తెలుస్తోంది. తాజాగా ఆమె సూచించిన రూ.36 లక్షలతో చేపట్టే 8 పనులకు మంత్రి సూచనతో అధికారికంగా ఆమోదం లభించింది. ఇందులో ఇచ్చోడలో రూ.4.50 లక్షలతో ఒక పని ఉండగా.. మిగతా 7 పనులు నేరడిగొండ మండలంలోనివి. ప్రస్తుతం ఈ విషయం కాంగ్రెస్‌లో మళ్లీ చర్చకు దారితీసింది.

రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే: జిన్నింగ్ మిల్లులకు పత్తి పంటను విక్రయించేందుకు వచ్చే రైతులకు అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ అన్నారు. బుధవారం మండలంలోని మూడు జిన్నింగ్ మిల్లులను పరిశీలించారు. బిల్లులు వెంటనే అందజేయాలని అన్నారు. తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించారు. తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ రమేష్, ఎంఆర్ఐ మెస్రం లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.


బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఎల్లలు దాటిన బతుకమ్మ వేడుకలు

యూఎస్‌లోని హవాయి నగరంలో బతుకమ్మ వేడుకలు మిన్నంటాయి. అక్కడ నివసిస్తున్న తెలుగు రాష్ట్రాల ప్రజలు ఫుట్‌బాల్ మైదానానికి చేరుకున్నారు. బతుకమ్మలను అందంగా అలంకరించి గౌరమ్మను పూజించారు. మహిళలు సామూహికంగా బతుకమ్మ ఆడుతూ సందడి చేశారు. అనంతరం సమీపంలోని కొలనులో నిమజ్జనం చేశారు.
- న్యూస్‌టుడే, ఆదిలాబాద్ సాంస్కృతికం

సోయా కొనుగోళ్ల పరిమితి పెంపు

తాంసి, న్యూస్‌టుడే : ప్రభుత్వం మార్క్‌ఫెడ్, సహకార సంఘాల ద్వారా జిల్లా వ్యాప్తంగా తొమ్మిది సోయా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఎకరానికి 6 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేసేలా నిబంధన పెట్టింది. ఈ ఏడాది ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్ల వరకు దిగుబడి రావడంతో మిగతా పంటను తక్కువ ధరకు బయట మార్కెట్‌లో విక్రయించుకోవడానికి కర్షకులు ఇబ్బందిపడ్డారు. ఈ విషయమై అక్టోబరు 8న 'ఈనాడు'లో ప్రచురితమైన 'కొనేది 6.. మిగతాది ఎలా సారు' కథనానికి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో సమస్య పరిష్కారమైంది. నిబంధనను సవరించి, ఎకరానికి 10 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేసేలా అనుమతించింది. తాంసి బుధవారం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి.


తాంసి వ్యవసాయ ఉప మార్కెట్ యార్డులో ప్రారంభమైన సోయా కొనుగోలు

ఈనాడు స్పందనకు వందనం

పాఠశాల భవన నిర్మాణానికి చర్యలు

బేల, న్యూస్‌టుడే: బేల మండలం పిట్‌గావ్(ఎల్)లో అసంపూర్తిగా ఉన్న ప్రాథమిక పాఠశాల కొత్త భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా అధికారులు చర్యలు చేపట్టారు. 'గుడిలో సాగుతున్న బడి' శీర్షికన 'ఈనాడు'లో బుధవారం ప్రచురితమైన కథనానికి విద్యాశాఖ అధికారులు స్పందించారు. ఎంఈఓ కోల నర్సింహులు పాఠశాలను సందర్శించారు. సంబంధిత గుత్తేదారు, గ్రామస్థులతో సమావేశమై పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు.


గ్రామస్థులతో సమావేశమైన ఎంఈఓ నర్సింహులు


ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ నగేష్, కలెక్టర్ రాజర్షి షా, పుర అధ్యక్షుడు జోగు ప్రేమేందర్

స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా ఎదగాలి

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : మహిళా స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా ఎదగాలని ఎంపీ గోడం నగేష్ అన్నారు. బుధవారం బల్దియా పాత కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్‌ను కలెక్టర్ రాజర్షి షా, బల్దియా అధ్యక్షుడు జోగు ప్రేమేందర్‌తో కలిసి ప్రారంభించారు. పుర కమిషనర్ ఎండీ ఖమర్ అహ్మద్, కౌన్సిలర్లు, బల్దియా అధికారులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

సర్కారు వైద్యం బహుబాగు

★ రిమ్స్‌లో వైద్య పరీక్షలు చేయించుకున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

ఆదిలాబాద్ వైద్య విభాగం, న్యూస్‌టుడే : రిమ్స్‌లో వైద్య సేవలు బాగున్నాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు అన్నారు. బుధవారం ఆయన నేరుగా రిమ్స్ అనుబంధ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి రిమ్స్ ప్యానల్ అడ్వకేట్ జొందలే అజయ్‌కుమార్‌తో కలిసి వచ్చి టూడీఈకో పరీక్షలు చేయించుకున్నారు. సర్కారు దవాఖానాలో నాణ్యమైన వైద్య సేవలందుతాయనే భరోసాతో ఆయన ఈ పరీక్షలు చేయించుకున్నారు. ఆసుపత్రి పనితీరుపై రిమ్స్ సంచాలకుడు రాఠోడ్ జైసింగ్‌తో సమావేశమై చర్చించారు.


పరీక్షలు చేయించుకొని వస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు

పెండింగ్ డీఏల కోసం పోరుబాట



కరపత్రాలు విడుదల చేస్తున్న తపస్ నాయకులు

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : పెండింగ్ డీఏ, పీఆర్సీ, అన్ని రకాల బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్లతో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) పోరుబాట పట్టనుంది. బుధవారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో పోరాట సన్నద్ధతపై చర్చించారు. కరపత్రాలు విడుదల చేశారు. సంఘం జిల్లా అధ్యక్షులు సునీల్ చౌహాన్ మాట్లాడుతూ ప్రభుత్వ తీరుకు నిరసనగా 28న మండలస్థాయిలో, నవంబరు 5న కలెక్టరేట్, నవంబరు 23న ఇందిరాపార్కు వద్ద దశల వారీ ఆందోళనలు చేస్తున్నట్లు వివరించారు. ప్రధాన కార్యదర్శి గోపికృష్ణ, నాయకులు గంగాధర్, రాజ్‌కుమార్, సురేష్, గోమంత్‌రెడ్డి, చంద్రశేఖర్, ఉపేందర్, జీజాబాయి పాల్గొన్నారు.

అభివృద్ధి వైపు అడుగులు

ఇచ్చోడ, న్యూస్‌టుడే : అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. నియోజకవర్గ అభివృద్ధిలో పార్టీలకు అతీతంగా అడుగులు వేయాలన్నారు. బుధవారం ఇచ్చోడలోని బాలికల, బాలుర గిరిజన గురుకుల పాఠశాలలో అదనపు గదుల నిర్మాణాలను ప్రారంభించారు. బాలికల గిరిజన గురుకుల పాఠశాలలో పనులు ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యేలకు అక్కడి సిబ్బంది సమస్యలను విన్నవించారు. ఇక్కడ బస్సు నిలపడం లేదని, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఆయా పార్టీల నాయకులు తదితరులు ఉన్నారు.


బాలికల గిరిజన గురుకుల పాఠశాలలో పనులు ప్రారంభిస్తున్న ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్

విద్యార్థులకు అన్ని అంశాల్లో అవగాహన అవసరం

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : విద్యార్థులు అన్ని అంశాల్లో అవగాహన కలిగి ఉంటే భవిష్యత్తులో ప్రతిభావంతులుగా మారుతారని టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు పేర్కొన్నారు. పోలీసు అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా బుధవారం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఓపెన్ హౌజ్ కార్యక్రమంలో ఆయన విద్యార్థినులకు పోలీసుల విధులు, వారు వినియోగించే ఆయుధాలు, చట్టాల గురించి అవగాహన కల్పించారు.


పోలీసుల ఆయుధాల గురించి విద్యార్థులకు వివరిస్తున్న టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు

ఆదిలాబాద్ గ్రామీణం: రణదీవెనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎస్ఐ ముజాహిద్ పోలీసుల విధులు, ఆయుధాల వాడకంపై అవగాహన కల్పించారు.

తాంసి: తాంసి పోలీసు స్టేషన్ ఆవరణలో ఎస్ఐ శివరాం ప్రభుత్వ ఉన్నత, కళాశాల విద్యార్థులకు ఆయుధాల గురించి వివరించారు. ఎంఈఓ శ్రీకాంత్ ఉన్నారు.

జైనథ్: జైనథ్ పోలీస్ స్టేషన్‌లో ఆదర్శ పాఠశాల విద్యార్థులకు ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఇంద్రవెల్లి: ఉట్నూరు సీఐ మొగిలి పోలీసు స్టేషన్‌లో పోలీసులు వాడే ఆయుధాలపై జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు.

నార్నూర్: నార్నూర్‌లో పోలీస్ స్టేషన్‌లో సీఐ రహీమ్ పాషా ఏకలవ్య గురుకుల ఇంటర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఆదిలాబాద్ నేర విభాగం: మావల పోలీసు స్టేషన్‌లో శిక్షణ ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి అవగాహన కల్పించారు.

కల్లుగీత వృత్తిని పరిశ్రమగా గుర్తించండి

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : కల్లుగీత వృత్తిని పరిశ్రమగా గుర్తించి కార్మికులను ఆదుకోవాలని గౌడజన హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బుధవారం పట్టణంలోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్పొరేషన్‌కు వెంటనే పాలకవర్గాన్ని నియమించి రూ.5 వేల కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ ఛైర్మన్ అమరవేణి నర్సాగౌడ్, నాయకులు నారాయణగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, నాగరాజ్‌గౌడ్, నర్సాగౌడ్, బాలాగౌడ్, రాజేశ్వర్‌గౌడ్, మురళీగౌడ్ తదితరులున్నారు.

పిల్లలను ప్రోత్సహించండి

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే : ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రోత్సహించి ఉన్నత విద్యను అభ్యసించేలా ప్రోత్సహించాలని జిల్లా ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. కానిస్టేబుల్ రాఠోడ్ అరవింద్ కుమారుడు సాయికృష్ణ నీట్‌లో ఎస్టీ విభాగంలో 23వ ర్యాంకు సాధించి ఉస్మానియా వైద్య కళాశాలలో సీటు సాధించగా బుధవారం అభినందించారు. ఉట్నూరు డీఎస్పీ నాగేందర్‌గౌడ్, సీఐ మొగిలి పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి బయల్దేరిన ఆయన ఆదిలాబాద్ పట్టణంలో ఆగారు. పార్టీ నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. నాయకులు నగేష్, అశోక్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రవీణ్ రెడ్డి, సంతోష్, శంతన్‌రావు, చరణ్‌గౌడ్, రామ్‌కుమార్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పరుగు పోటీలు

బోథ్, న్యూస్‌టుడే : బోథ్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా బుధవారం ఉదయం పోలీసుల ఆధ్వర్యంలో 2కె రన్ నిర్వహించారు. యువకులు పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన యువకులకు సీఐ రమేష్, ఎస్ఐ ప్రవీణ్‌లు పతకాలు అందజేశారు. న్యాయవాది హరీశ్, పోలీసు సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.


విద్యుత్తు దీపాల వెలుగుల్లో పోలీసు అమర వీరుల స్తూపం

ఆకట్టుకునేలా విద్యుత్తు దీపాలతో అలంకరణ

పోలీసు అమర వీరుల వారోత్సవాలను పురస్కరించుకొని జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంతో పాటు ఏఆర్ హెడ్‌క్వార్టర్‌లో విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేసి ఆకట్టుకునే విధంగా బుధవారం రాత్రి పోలీసులు ముస్తాబు చేశారు. ప్రధానంగా పోలీసు అమర వీరుల స్తూపాన్ని అత్యంత సుందరంగా విద్యుత్తు దీపాలతో అలంకరించారు.
- న్యూస్‌టుడే, ఆదిలాబాద్ నేర విభాగం

చేపల వేటకు వెళ్లి ఒకరు మృతి

జైనథ్, న్యూస్‌టుడే : జైనథ్ మండలం పిప్పర్‌వాడకు చెందిన కాప్‌డే రమేష్(30) చేపల వేటకు వెళ్లి మృతి చెందాడు. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ సమీపంలోని వాగులో మంగళవారం సాయంత్రం చేపలు పట్టేందుకు వెళ్లాడు. లోతు ఎక్కువగా ఉండటంతో మునిగిపోయాడు. అటువైపున చేనులో పని చేసి వస్తున్న నైతం విఠల్ మృతదేహాన్ని చూసి గ్రామస్థులకు సమాచారం అందించాడు. స్థానికులు రిమ్స్ అసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందాడని ధ్రువీకరించారు. అతడికి భార్య శిరీష, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.


రమేష్

చికిత్స పొందుతూ యువకుడు..

తలమడుగు, న్యూస్‌టుడే : ఉమ్రి గ్రామానికి చెందిన సాయికిరణ్(22) బుధవారం రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. పోలీసుల కథనం ప్రకారం.. గేడం సాయికిరణ్ కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. మంగళవారం ఉదయం పత్తి పొలంలో వాంతులు విరేచనాలతో స్పృహతప్పిపోయాడు. రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం చనిపోయాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై అంజమ్మ తెలిపారు.

పురుగుమందు తాగి ఒకరి ఆత్మహత్య


నేర వార్తలు

గుడిహత్నూర్, న్యూస్‌టుడే: మచ్చాపూర్ పంచాయతీ నేరడిగొండతండాలో పురుగు మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ ఇమ్రాన్ తెలిపారు. ఆడే గజానంద్(30) వ్యవసాయంతో పాటు మండల కేంద్రంలో పాన్ దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. వ్యవసాయం కోసం రూ.3 లక్షల వరకు అప్పు తీసుకున్నాడు. ఈ ఏడాది పంటలకు సరైన దిగుబడులు రాక మనోవేదనకు గురయ్యాడు. మంగళవారం సాయంత్రం చేనులో పురుగు మందుతాగి పడిపోయాడు. కుటుంబ సభ్యులు ప్రైవేటు వాహనంలో రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.


గజానంద్

రోడ్డు ప్రమాదంలో చోదకుడి దుర్మరణం

గుడిహత్నూర్, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలు వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మన్నూర్ గ్రామానికి చెందిన ఓ లారీ డ్రైవర్ మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. బాలాజీ ముండే(34) మంగళవారం మహారాష్ట్రలోని అమరావతి నుంచి ఒంగోలుకు పండ్ల లోడును ఐచర్ వాహనంలో తీసుకెళ్తుండగా ఒంగోలు వద్ద ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీకొనడంతో బాలాజీ, క్లీనర్ సచిన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బాలాజీ మృతి చెందినట్లు తెలిపారు.



బాలాజీ ముండే

ఇచ్చోడ: రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం పాలైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం బిలోలికి చెందిన అభిరాజ్(19) తన మిత్రుడితో కలిసి ద్విచక్ర వాహనంపై ఉట్నూరు వెళ్లి తిరుగు ప్రయాణమయ్యాడు. ఇచ్చోడ సమీపంలోని జాతీయ రహదారిపై వెనుక నుంచి నీటి ట్యాంకర్‌ను ద్విచక్రవాహనం ఢీకొట్టింది. అభిరాజ్ తీవ్రంగా గాయపడటంతో.. స్థానికులు రిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లే క్రమంలో మృతి చెందినట్లు తెలిపారు.


అభిరాజ్

కారు దహనం చేసిన నిందితుడి రిమాండ్

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : కారును దహనం చేసిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆదిలాబాద్ వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. గాంధీచౌక్ ప్రాంతంలోని భగవాన్‌పూర్‌లో నివాసం ఉండే అజయ్‌కుమార్ తన కారును సోమవారం రాత్రి ఇంటి ముందు నిలిపి ఉంచాడు. పాత కక్షల కారణంగా బాధితుడి బాబాయ్ కుపట్ మారుతి నిప్పుపెట్టాడు. ఎస్ఐ పద్మ నిందితుడు మారుతిని బుధవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి జుడీషియల్ రిమాండ్‌కు ఆదేశించారన్నారు.

బియ్యం సరఫరాలో నిబంధనలు పాటించండి

ఉట్నూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలు, రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరాలో నిబంధనలను పాటించాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వాజీద్ అలీ ఆదేశించారు. బుధవారం ఆయన ఉట్నూరులోని మండల స్థాయి నిల్వ గోదాం(ఎంఎల్ఎస్ పాయింట్)ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. అక్కడి నుంచి ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్‌ను కలిశారు. డిప్యూటీ తహసీల్దార్లు విశ్వనాథ్, మధుసూదన్‌లు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

ఉట్నూరు గ్రామీణం: వాహన చోదకులు మద్యం తాగి వాహనాలు నడపవద్దని ఆర్టీసీ అధికారి శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఉట్నూరు మండలం శ్యాంపూర్‌లో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.

పోగొట్టుకున్న చరవాణుల అప్పగింత

ఇంద్రవెల్లి: పోలీసు శాఖ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉట్నూరు డీఎస్పీ నాగేందర్‌గౌడ్ అన్నారు. బుధవారం ఇంద్రవెల్లి పోలీసు స్టేషన్‌లో బాధితులు పోగొట్టుకున్న చరవాణులను రికవరీ చేసి అందించారు. సీఐ మొగిలి, ఎస్సై సునీల్, పోలీసులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వం అవినీతికి పాల్పడింది

భుక్తాపూర్: గత ప్రభుత్వం తెలంగాణలో అవినీతికి పాల్పడిందని సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. నాయకులు సత్యాజీ, కృష్ణయ్య, నర్సింగ్‌రావు, రమేశ్, గణేశ్, రాందాస్, లక్ష్మీబాయి ఉన్నారు.

అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారు?

మావల(వాఘాపూర్):: భారాస ప్రభుత్వ హయాంలో జిల్లా రైతాంగానికి, నిరుద్యోగులకు మాజీ మంత్రి కేటీఆర్ ఏం చేశారని డీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు భూపెల్లి శ్రీధర్ ప్రశ్నించారు. బుధవారం మావల మండలం వాఘాపూర్‌లో మాట్లాడారు.

రైతులపై మాట్లాడే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదు

ఆదిలాబాద్ అర్బన్: రైతు సమస్యలపై ధర్నా చేసే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదని డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. భారాస పదేళ్ల అధికారంలో ఉండి రూ.లక్ష రుణమాఫీ చేయలేదని విమర్శించారు. నాయకులు రవి, మన్సూర్, ధర్మారెడ్డి తదితరులున్నారు.

బీడీ కార్మికుల సమస్యలపై పోరాటం

బోథ్, న్యూస్‌టుడే : బీడీ కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటాలు సాగించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజ్ అన్నారు. బోథ్‌లోని సీపీఐ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన బీడీ కార్మిక సంఘం 2వ మహాసభలలో ఆయన పాల్గొని మాట్లాడారు. విలాస్, భరత్, దేవేందర్, రాజు, గోవర్ధన్, జిల్లా నాయకురాలు గోదావరి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అక్రమ లేఅవుట్ల తొలగింపు

ఆదిలాబాద్ అర్బన్: జిల్లాకేంద్రంలో వెలిసిన అక్రమ లేఅవుట్లను బుధవారం పురపాలక అధికారులు తొలగించారు. భాగ్యనగర్, చిల్కూరి లక్ష్మీనగర్‌లో ప్రైవేటు స్థలంలో కొందరు అక్రమంగా లేఅవుట్ చేసి ప్లాట్లను విక్రయిస్తున్నారన్న ఫిర్యాదుతో బల్దియా కమిషనర్, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు పోలీసుల సాయంతో అక్కడికి చేరుకున్నారు. జేసీబీని తెప్పించి ప్లాట్లకు వేసిన హద్దురాళ్లను తొలగించారు. టీపీఓ సుమలత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేందర్, సిబ్బంది ఉన్నారు.

జోరుగా తనిఖీలు

ఆదిలాబాద్ నేర విభాగం: ప్రస్తుతం మహారాష్ట్రలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున మహారాష్ట్రకు వెళ్లే వారు సరైన పత్రాలు లేకుండా రూ.50 వేలకు పైగా నగదును తరలిస్తే స్వాధీనం చేసుకుంటామని డీఎస్పీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన పలు చెక్‌పోస్టులను తనిఖీ చేశారు.

క్విజ్ పోటీల్లో రాష్ట్రస్థాయి తృతీయ బహుమతి

ఆదిలాబాద్ వైద్య విభాగం: వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఎయిడ్స్ నియంత్రణ విభాగం నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో జిల్లా కేంద్రంలోని టీజీఎస్ డబ్ల్యూఆర్ఎస్ విద్యార్థినులు ప్రతిభ కనబర్చి తృతీయ బహుమతిని సాధించారు. బి.సమీక్ష(ఇంటర్ మొదటి ఏడాది), ఎం.అక్షయ(9వ తరగతి) హైదరాబాద్‌లో మంగళవారం రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని తృతీయ బహుమతిని సాధించి నగదు రూ.6 వేల బహుమతిని కైవసం చేసుకున్నారు. బుధవారం డీఎంహెచ్ఓ వారిని అభినందించారు. అదనపు డీఎంహెచ్ఓ ఎం.గజానన్, వైద్యుడు వంశీకృష్ణ, మాస్ మీడియా అధికారి వెంకట్‌రెడ్డి, బి.నాగరాజు, సతీష్, రాజశేఖర్ ఉన్నారు.

ఘన సన్మానం

తలమడుగు: మండల విద్యుత్తుశాఖ ఏఈ సతీష్ ఇటీవల బదిలీ కావడంతో రైతులంతా ఆయనను సుంకిడిలో సన్మానించారు. ఎస్ఈ చౌహాన్, జడ్పీటీసీ మాజీ సభ్యులు గణేష్‌రెడ్డి, బాబన్న, డీఈ ఈదన్న, తదితరులు పాల్గొన్నారు.


పొచ్చరలో ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్యే అనిల్ జాదవ్

మహిళలు రాణించాలి

బోథ్, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. పొచ్చర జలపాతం వద్ద ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్‌ను బుధవారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. డీఆర్‌డీవో సాయన్న, తహసీల్దార్ సుభాష్ చంద్ర, ఎంపీడీవో జీవన్‌రెడ్డి, మహిళ శక్తి సంఘం మండల అధ్యక్షురాలు ప్రమీల, డీపీఎం గంగన్న, ఇన్‌ఛార్జి ఎఫ్ఆర్వో పుండలీక్, ఏపీఎం మాధవ్ పాల్గొన్నారు.

డిసెంబరులోగా దరఖాస్తు చేయాలి

పాలనాప్రాంగణం : ఎస్సీ ఉపకార వేతనాలకు డిసెంబరు 31లోగా దరఖాస్తు చేసుకోవాలని పాలనాధికారి రాజర్షిషా అన్నారు. కళాశాల ప్రిన్సిపాళ్లు ప్రత్యేక చొరవ చూపాలని ఆదేశించారు.